# తీరని కోరిక

గాలిలో తేలిపోతున్న నీలి మేఘాల వేపు అర మోడ్పు కన్నులతో చూస్తున్నారు రఘురామయ్యగారు. సంధ్యారుణ వర్ణాన్ని పులుముకొని, విలాసంగా వెడుతున్న మబ్బులు, అందమైన అప్సరసల్లా అనిపించాయి ఆయనకు. తదేక ధ్యానంతో చూస్తున్నారు.

"నాన్నగారూ! ఎటూ మేం వెడుతున్నాం, మీరూ రాకూడదూ? ఆ భద్రాద్రి చూచుకుని ఆ తర్వాత. తిన్నగా, శ్రీశైలం, కాశీ, ప్రయాగ, ఢిల్లీ ... ఓహ్! ఒక టేమిటి, బుర్రలో ఎప్పుడేది మెదిలితే అక్కడికి వెళ్ళి చూచొద్దాం... వస్తారా?" కొడుకు రామం, కుర్రాడు పాఠం అప్పగించినట్లుగా చెప్పేశాడు.

రఘురామయ్యగారికి ధ్యానభంగమయింది. ముఖం తిప్పి కొడుకు వేపు చూచారు. జవాబుకోసం నిల్చున్నాడతను. తలుపుపక్కగా సన్నగా గాజులచప్పుడవుతోంది! ఆయన వెంటనే గ్రహించేసారు సంగతి. కోడలు రామలక్ష్మికూడా తన జవాబుకోసం నిరీక్షిస్తోందన్నమాట!

ఎందుకులే నాయనా! మీరు వెళ్ళిరాండి! ఈకాలంలో ఇల్లు ఇలా ఖాళీగా వదిలేసిపోవడం ఏమంత మంచిది కాదు... నే రాలేనుకూడా బాబూ!" రఘురామయ్యగారు నిట్టూర్పు వదిలారు.

"వ్చ్! ఏమిటోలే..." తనలో గొణుక్కుంటున్నట్టుగా లోపలికెళ్ళాడు రామం.

"నే చెప్పలేదు రామలక్ష్మీ? ఆయన రారని! కానున్నా

ఒక్సారి రారన్న తర్వాత నీకెందుకీ యావ?" లోపల్నుంచి సన్నగా రామం మాటలు విన్పించాయి.

"నాకు మాత్రమేం తెల్సూ? మామయ్యగారు ఇంత మొండివారనుకోలేదు. కాకున్నా ఈ ముసలి వాళ్ళకు ప్రాపంచిక విషయాల మీదుండే మమకారం, దేవుని మీదా, పుణ్యక్షేత్రాలమీదా ఎందుకుండదో బుర్ర బద్దలు కొట్టు కున్నా నాకర్థంకాదు!" రామలక్ష్మి గొణుగుతూ పెరట్లోకి పోతూ విన్పించింది!

రఘురామయ్యగారికి లోపల్నుంచి వస్తున్న విమర్శలు, సూటిగా వచ్చి తగుల్తున్నాయి! ఆయన చిన్నగా నవ్వు కున్నారు. నిజమే! ఈ వయసులో ఎవరికేనా కృష్ణా, రామా అనుకోవాలనీ, యాత్రలు చేయాలనీ వుంటుంది. కానీ తన కలాంటి వాంఛ లేదెందుకని? అవకాశం వుండీకూడా ఇలా దుర్వినియోగం చేసుకొనే వాళ్లెవరేనా వుంటారా?

ఆయన ఆలోచనలు సుడులు తిరిగి, యువక వయసు లోనికి వెళ్ళి వస్తున్నాయి. అక్కణ్ణుంచి ఒకొక్క సంఘటననే, దృశ్య కావ్యంలా చిత్రించుకుంటూ రావటం మొదలెట్టాయి!

రఘురామయ్య భార్య వరలక్ష్మి, "వరలక్ష్మి" లానే ఆ ఇంట్లో అడుగెట్టింది. అందాకా ఓ మోస్తరుగా పరువుగా జరుగుతూన్న సంసారంలో, సిరిసంపదలు పాలపొంగులా పొర్లాయి! రఘురామయ్య ఆ ఏడే కొత్తగా పెట్టిన వ్యాపా రంలో పట్టిందంతా బంగారమయింది. తండ్రి నీలకంఠయ్య పౌరోహిత్యాలు చాలావరకు మానేశాడు! ఓ వేళ విధిగా వెళ్ళాల్సివచ్చినా, అదీ ఉచితంగా, గౌరవంకోసం, పెద్దతర

హాగా నిర్వహించేలా చేశాడు రఘురామయ్య. తల్లి జగదాంబ చేసే పనులకోసం, ఆ స్థానంలో వంటమనిషి వచ్చేసింది! చెల్లెలు మీనాక్షి హైస్కూల్లో. తమ్ముడు విశ్వం కాలేజీలో చేరారు. ఇంట్లో నౌకర్లు, గొడ్డూ, గోదా వచ్చేశాయి! కాస్త భూమి కూడా కొనేశాడు. ఇవన్నీ వరలక్ష్మి కాపురాని కొచ్చిన ఐదేళ్ళలో ఆ యింట్లో వచ్చిన మార్పులు!

పిండారబోసినట్లు వెన్నెల కాస్తోంది. పాల నురగలా వున్న పక్కమీద పడుకుని, పదిగంటలు చూపిస్తున్న గడియారం కేసి చూస్తూ, వరలక్ష్మి ఇంకా రాలేదేమనే విసుగుతో ఆలోచిస్తున్నాడు రఘురామయ్య.

“అంత దీర్ఘమైన ఆలోచనేమిటో?” చేతిలో తమలపాకులు చీల్చిపెట్టి, గుప్పెట మూసేవరకూ, ఆమె అక్కడి కొచ్చిందనే సంగతి పసిగట్టలేకపోయాడు రఘురామయ్య.

పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కూర్చున్నారు. హఠాత్తుగా అడిగింది వరలక్ష్మి.

“నేనో మాట అడుగుతాను...”

“ఒక్కటికాదు వెయ్యడుగు...” బుజ్జగించాడు రఘురామయ్య.

“చిన్నకోరిక...మీ కెలాగూ ఓ నెలరోజుల వరకూ శలవులున్నాయి కదా? అలా శ్రీరామనవమి నాటికి భద్రాద్రి వెళ్లొద్దాం! ఏమంటారు?” వరలక్ష్మి తలవంచుకొని తమలపాకు ఈనెల్ని గిల్లుతోంది.

రఘురామయ్య గలగల నవ్వాడు. “బాగుంది కోరిక!

ఎప్పుడో ముసలివాళ్ళ మయింతర్వాత ఉండాల్సిన కోరిక ఇప్పుడా? ఊఁ, భద్రాద్రినుంచి...?''

భర్తగొంతులో హేళన గమనించలేకపోయిందామె.

''వీలైతే... కాశీ, రామేశ్వరం, శ్రీశైలం...

''...దేశమంతా! అవునా?'' అమాయకంగా చెప్పాక పోతున్న ఆమె మాటలకు అడ్డొస్తూ వెక్కిరించాడు. పలకలేదు ఆమె!

రఘురామయ్య చిన్నగా నవ్వాడు. ''చూడు వరం! ఏ వయసులో వుండాల్సిన ముచ్చట్లు ఆ వయసులో వుండాలి. కాస్త నాకు తీరికయిన ఈ రెండు నెలలూ, యాత్రలూ, గీత్రలూ అంటూ తిరిగి, తర్వాత మళ్ళీ కంపెనీ వ్యవహారాల్లో మునిగిపోవలసివస్తే ఎలా చెప్పు? వయసులో వున్నదంపతులము...ఆనందం యిప్పుడు కాకుంటే మరెప్పు డనుభవిస్తాం చెప్పు?'' అనునయించాడు.

''తర్వాత పిల్లలూ ... వాళ్ళూ...'' పూర్తిచెయ్యటానికి సిగ్గుపడింది వరలక్ష్మి.

''పుడితే, ముసలివాళ్ళమయింతర్వాత అందరం కలిసే చేద్దాంలేవోయ్ యాత్రలు......!'

ఆమె ఏదో చెప్పబోయింది...అతని చేతివ్రేళ్లు సున్నితంగా ఆమె నోటికి అడ్డొచ్చాయి!

మరో ఆరేళ్ళు గిరున తిరిగిపోయాయి. వరలక్ష్మి, వరలక్ష్మమ్మగా మారింది. ఆమె యిప్పుడు ముగ్గురు పిల్లల తల్లి! పెద్దవాడు గోపీని ముస్తాబుచేసి బడికి పంపాలి! రెండో పిల్ల

సరస్వతిని చూడాలి. చిన్నవాడు రామాన్ని అస్తమానూ కంటికి రెప్పలా కాపాడాలి! ఈ బాధ్యతలే కాకుండా మంచంలో వున్న అత్తగారికీ, కళ్లుసరిగా కన్పించని మామ గారికీ, ఉద్యోగం చేస్తున్న మరిదికీ, కాలేజీలో చదువుతున్న మీనాక్షికీ కావాల్సిన పనులు చూడాలి! భర్తపని సరేసరి!

రఘురామయ్యకే బాధ్యతా లేదు! కాకుంటే డబ్బు సంపాదించటం కుటుంబాన్ని నెట్టుకురావటం — రెండూ నల్లేరుపై బండి నడకలా సాగిపోతున్నా కూడా!.

ఆ రోజు, చాలా కాలం తర్వాత భార్యాభర్తలు, కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

"చిన్నవాడికి నాలుగో యేడు వచ్చింది...యింకేం" బెడద లేదు వాడితో! మీరైతే అలా భద్రాద్రి వరకూ..." వరలక్ష్మమ్మ నసిగింది.

"అన్నీ బాగున్నాయి! నీతో వచ్చిన చిక్కల్లా ఇక్కడేనే! ఒక వేపు మా నాన్నకు సరిగా కళ్ళు కన్పించటం లేదు...అమ్మ మంచంలో వుంది..." రఘురామయ్య విసుక్కున్నాడు.

"ఒక్క వారం రోజులు మీనాక్షి సర్దుకోలేదా? ఎలాగూ సెలవులే కదా దానికి" భార్యమాట పూర్తి కాక ముందే అగ్గి అయిపోయాడతను.

"వాళ్ళిద్దరిలో ఎవరికేనా ఏదయినా అయితే లోకం మనల్ని దుమ్మెత్తిపోస్తుంది....మీనాక్షి ఏనాడేనా పరాయింటి పిల్లేకదా?" వరలక్ష్మమ్మ నోరు యిక మెదపలేక పోయింది.

సంవత్సరము తర్వాత మళ్ళీ ఒక రోజు కదిపింది వరలక్ష్మమ్మ, ఈ సారి ఆమెకొక్క స్తకోపంకూడా వచ్చినమాట నిజమే !

"అంతగా మీకు డబ్బుఖర్చవుతుందనుకుంటే, ఇదుగో నాపతకం అమ్మండి. ఇది యేఃమిది నవర్సులుంది !"

రఘురామయ్య కస్సుమన్నాడు.

"ఇక ఆ ప్రస్తావనే నా దగ్గర తేవద్దు... తెల్సిందా ?" అన్నాడు.

అతనిలో మొదట్లో ఆమె కోరిక న్యాయతన మనిపించింది. రాను రాను యేదో అర్థం లేని మొండితనం ఎక్కువైపోయింది! అసలిలాంటి కోరిక ఆమెకు వుండకూడదు అనే పట్టుదల యెక్కువైంది !

మీనాక్షి పెళ్ళికుదిరింది. "మా జానకి చేత బట్టగా...!" మేళగాళ్ళు ఊగిపోతూ వాయిస్తున్నారు. క్షణం తీరుబడి లేకుండా సుడితిరిగిపోతూంది వరలక్ష్మమ్మ. ఈ ఒక్క సంవత్సరమూ అమ్మ బ్రతికుంటే ఎంత బాగుండేది ? అనే ఆలోచన అప్పుడప్పుడు వచ్చినా, తోసేసుకు తిరుగుతున్నాడు రఘురామయ్య. కళ్ళు కనిపించకున్నా ఊహల్లో పరవశిస్తున్నాడు నీలకంఠయ్య !

ఉన్నట్టుండి పందిట్లో అలజడి రేగింది. మరో ఆరువందలు అదనంగా యిస్తేగానీ పీటలమీదకు రానంటున్నాడట పెళ్ళికొడుకు ! లేదా మరో ఐదునవర్సుల బంగారమైనా పెళ్ళికూతురికి పెట్టాలని పట్టుబట్టాడట !

రఘురామయ్య మండిపడ్డాడు "నా చెల్లెలికి వేరే సంబంధం చూచుకుంటాలే!" అని ఎగిరిపడ్డాడు.

మెల్లిగా లోపలికి పిల్చికెళ్ళింది వరలక్ష్మమ్మ "ఎందుకలా విరుచుకుపడ్తారు? ఒక్క ఆరువందలదగ్గర, కుదిరినపెళ్ళి పాడుచేసుకుంటారా? వాళ్ళకేం మగపిల్లాడివేపువారు. పరువు పోయేది మనక్కాదూ?" వరలక్ష్మమ్మ మందలిస్తుంటే కాస్సేపు చూస్తూ వూరుకున్నాడు రఘురామయ్య తర్వాత మెల్లిగా అన్నాడు.

"చూడు వరం! నీకు తెలీందేమీలేదు. మూడేళ్ళనుంచి వ్యాపారం దెబ్బతిని...ఎల్లాగో కట్నం తప్పనిసరిగా సర్దుబాటు చేశాను, లాంఛనాలూ బాగానే జరిపితిని...ఇప్పుడో ఆరొందలంటారు...మరి కాస్సేపటికి వెయ్యంటారు..." మళ్ళీ కోపం ముంచుకొచ్చింది ఆయనకు.

వరలక్ష్మమ్మ ఆయన గుప్పెట్లో ఏదోవుంచింది విప్పర పోతూ చూచాడు...పతకం! "ఇదెందుకు?"

"మీనాక్షికి యివ్వండి... పెళ్ళి సవ్యంగా జరిపించండి..." జవాబు ఆశించకుండా ఆమె వంటపందిరి వేపునడిచి పోయింది.

కొడుకులు పెద్దవాళ్ళవుతున్నారు. సరస్వతి పెరుగుతోంది. తమ్ముడు పెళ్ళిచేసుకొని ఉద్యోగం చేస్తున్నాడు. నీలకంఠయ్య భార్యదగ్గరకు వెళ్ళిపోయాడు.

నాలుగురోజుల్నుంచి వరలక్ష్మమ్మకు ఆగకుండా జ్వరం వస్తోంది. ఒకటి రెండురోజులు 'అదేం చేస్తుందిలె'మ్మని తోసే

సుకతిరిగింది. మూడోరోజు మంచంమీదనుంచి దిగలేకపోయింది. డాక్టరు వచ్చాడు, మందిచ్చాడు. నయం కనిపించలేదు. వారం రోజులు గడిచింది. టైఫాయిడ్‌లోకి దించింది.

ఆ రోజు సాయంత్రం సరస్వతి యిచ్చిన కాఫీ తాగి, అలా భార్య గదిలోకి వెళ్ళాడు రఘురామయ్య. నీరసంగా నిద్రపోతోంది ఆమె. అది నిద్రకాదు, మగత! చెయ్యివేసి చూచాడు. ఒళ్ళు మండిపోతూంది. అనుకోకుండా ఆయన కళ్ళల్లో నీళ్ళునిండాయి. ఆప్యాయంగా భార్యవేపు చూచాడు. ఆ మగత మూసుకున్న కళ్ళల్లో ఏదో తీరని కోరిక మెదిలినట్లయి ఒళ్ళంతా దహించినట్లుగా బాధపడ్డాడాయన.

అవును మరి! తల్లి తండ్రీ, ఏది కోరినా, తీర్చకుంటే ఏమనుకుంటారోనని భయంతో తీర్చేవాడు! తమ్ముడునాలుగు మార్లు ఫేలయితే, కిమ్మనకుండా, మళ్లీమళ్లీ చదివించాడు! చెల్లెలు పెళ్ళి, నాన్నగారి తృప్తికోసం, అప్పుచేసి మహా ఘనంగా చేశాడు! కొడుకు పిక్నిక్‌కు వెళ్లాలంటూ వంద రూపాయ లడిగితే కాదనలేకపోయాడు! సరస్వతి 'నెక్‌లెస్' కావాలని ఏడిస్తే, కొనివ్వక తప్పలేదు! రాముం క్రికెట్ నేర్చుకోటానికి డ్రెస్సులు వగైరాలకు రెండు వందలు చూస్తుండగానే పట్టుకుపోయాడు! కానీ ... కానీ... వరలక్ష్మమ్మ ఎన్ని మార్లో అడిగింది. భద్రాద్రి వెళ్ళాలనీ, వీలైతే యాత్రలు చేయాలనీ! అది మాత్రం, కుంటి గుడ్డి సాకులతో, మొండి పట్టుదలతో ఎగురగొట్టేశాడు! ఎందుకని? కనీసం రెండు వందల రూపాయలు తన దగ్గర లేకపోయాయా?

తిరిగే శక్తి లేదా? అన్నీ వున్నాయి! కానీ యేదో అర్థం లేని పట్టుదల? ఎప్పుడో ముసలివాళ్ళయిం తర్వాత గాని అలా యాత్రలూ అవ్వీ చేయకూడదనే ఓ సిద్ధాంతం! వరలక్ష్మమ్మ ఏం చేస్తుందిలే అనే పురుషాహంకారం! ఇంట్లో ప్రతి ఒక్కరికీ సేవ చేసింది! ప్రతి ఒక్కరూ తమ కోరికలని నిస్సందేహంగా తీర్చుకున్నారు...తీర్చుకుంటున్నారు కూడా! కానీ ఆమె? అడిగింది ఒకే ఒకటి...అది తీరలేదు...ఇప్పుడయినా, అది తీరే మార్గం ఉందా? అన్ని విధాలా స్వతంత్రం వున్న భర్త అయి కూడా తానామె చిన్న కోరిక తీర్చలేక పోయాడు!

రఘురామయ్య ఒళ్లు భయంతో కంపించింది ఏమిటీ పిచ్చి ఆలోచనలు? హృదయంలోని పశ్చాత్తాపం కళ్ళల్లోకి నీళ్ళల్లా ప్రవహించింది! వరలక్ష్మమ్మ ప్రక్కకు ఒత్తిగిలింది! ''ఒక్క శ్రీరామ నవమికి ... కనీసం భద్రాద్రి కయినా వెళ్లొద్దాం......'' అస్పష్టంగా పలకరించింది!

''తప్పకుండా వరం! తప్పకుండా, నీకు నయం కాగానే వెళ్దాం!'' భోరున యేడుస్తూ ఆమె మీదకు వంగి ఆవేదన పట్టలేక అరిచాడు ఆయన! పిల్లలు ముగ్గురూ పరుగెత్తుక వచ్చారు! వరలక్ష్మమ్మ బలవంతాన కళ్ళు తెరచింది. అవి అలా యెంతోసేపు తెరచి వుంచలేక పోయింది...అవి శాశ్వతంగా మూతలు పడిపోయాయి!

తలెత్తి చూచారు రఘురామయ్యగారు! గుఱ్ఱబ్బండీలో సామాను చేరవేయిస్తున్నాడు రామం! ధారగా

కారుతున్న కన్నీటిని తుడుచుకుని సంతృప్తిగా నిట్టూర్చారు ఆయన! తనకు చిన్నతనంలో యీ పాటి జ్ఞానం లేకున్నా, కాలం యెప్పుడెలా నడుస్తుందో తెలీదు కాబట్టి వున్నంతలో త్వర త్వరగా మంచీ, పుణ్యమూ ఆర్జించాలీ, అనుభవించాలనే జ్ఞానం కొడుక్కి కలిగింది! అంతే చాలు! ఇప్పుడు తాను బయల్దేరితే మాత్రం? పైనుంచి వరలక్ష్మమ్మ నిష్ఠూరంగా చూస్తుంది. ఆ దేవుడు మాత్రం అంగీకరిస్తాడా? ఆవేదన పడిన నిండుప్రాణి చిన్నకోరిక తీర్చలేని తను యే ముఖం పెట్టుక యిప్పుడామె లేకుండా తీర్థయాత్రలు చేసి, దేవుడికి తన ముఖం ఎలా చూపగలడు?

"ప్చ! మీరు రా రా నాన్నా!" మళ్లీ రాము హెచ్చరించాడు. కోడలు బండిలోనుంచి ముఖం బయటికి పెట్టి చూస్తోంది.

"ఊహూఁ రాను నాయనా!"

బండి సాగిపోయింది. వెళ్తున్న బండివేపు చూస్తూ కొడుకూ, కోడలు స్థానంలో తననూ, వరలక్ష్మమ్మనూ ఊహించుకుంటూ అల్లాగే కూర్చుండి పోయారు రఘురామయ్యగారు!

—o—